• ఫోన్ మాట్లాడడంలో పోటీ!



'సెల్ ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరం.. ప్రాణాంతకం' అని పోలీసులు హెచ్చరిస్తున్నా కొందరికి పట్టడం లేదు. బైక్ నడుపుతూ ఫోన్ మాట్లాడడం నిత్యకృత్యంగా మారింది. ఈ చిత్రం చూడండి.. భీమవరంలో బైక్ నడిపే వ్యక్తే కాదు.. వెనక కూర్చున్న వ్యక్తి పోటీ పడి మరీ ఫోన్లు మాట్లాడుతున్నారు. 6

• చలిలో.. వెచ్చ వెచ్చగా..



జిల్లాలో చలి గాలులు వీస్తున్నాయి. రెండు, మూడు రోజులుగా సాయంత్రం అయ్యే సరికి రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతూ వస్తున్నాయి. తెల్లవారుజామున పొగ మంచు కమ్మేస్తోంది. వణికిస్తున్న చలికి జనం దుప్పట్లలో నుంచి ముసుగులు తీయడం లేదు. గ్రామాల్లో చలి మంటలతో జనం సేద తీరుతున్నారు. 6


• మావుళ్లమ్మ.. జ్యోతి యాత్ర



మావుళ్లమ్మ మాలధారుల జ్యోతి యాత్ర వైభవంగా సాగింది. భీమవరంలో గురువారం రాత్రి జరిగిన ఈ యాత్రలో పెద్ద సంఖ్యలో దీక్షధారులు పాల్గొని అమ్మను కీర్తించారు. మావుళ్లమ్మ శరణు ఘోషతో.. పులకించారు. ఓ చిన్నారి ఇలా జ్యోతిని పట్టుకుని మావుళ్లమ్మను ఆరాధించింది. 6

టెన్త్ పరీక్షలు తెలుగులో రాసేద్దాం

» ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త..



భీమవరం రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు పబ్లిక్ పరీక్షలను ఇంగ్లీష్‌లోనే కాదు.. తెలుగులో కూడా రాసుకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. ఇందుకు తెలుగులో రాస్తామనే ఆప్షన్ పెట్టుకోవాలి. ఇంగ్లీష్ మీడియంతో ఇబ్బంది పడుతున్న విద్యార్థులకు ఈ నిర్ణయం వెసులుబాటును కలిగిస్తోంది. జిల్లాలో 211 ప్రభుత్వ పాఠశాల్లో దాదాపు అన్ని ఇంగ్లీష్ మీడియంలోనే కొనసాగుతున్నాయి. 14 ఎయిడెడ్ పాఠశాలల్లో మాత్రం నాలుగు ఇంగ్లీష్ మీడియంలోకి ఈ విద్యా సంవత్సరం నుంచే మార్చారు. మిగిలిన పది ఎయిడెడ్ పాఠశాలల్లో తెలుగు మీడియంలో బోధన జరుగుతోంది. ప్రైవేట్, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో నుంచి 2024-25 విద్యా సంవత్సరంలో పబ్లిక్ పరీక్షలకు 24 వేల మంది విద్యార్థులు సిద్ధమవుతున్నారు. దీనిలో ప్రభుత్వ పాఠశాలల నుంచి ఇంగ్లీష్ మీడియంలో పది వేల మంది విద్యార్థుల వరకు పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉంది. గతంలో ఈ విద్యార్థుల్లో ఎక్కువ శాతం మంది తెలుగు మీడియం చదువుకున్నవారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇంగ్లీష్ మీడియంగా అన్ని ఉన్నత పాఠశాలలను మార్చారు. దీంతో విద్యార్థులు తరగతుల వారీగా ఇంగ్లీష్ మీడియం చదువుతూ ఇప్పుడు పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నారు. తెలుగులో ఎక్కువ సంవత్సరాలు విద్యా భ్యాసం చేసినందున వీరిలో కొందరికి తెలుగు మీద ఉన్న పట్టు ఇంగ్లీష్ మీద ఉండకపోవటం పరీక్షల్లో వెనుకబడుతున్నారు. ఇలాంటివి పరిగణనలోకి తీసుకుని తెలుగులో పదో తరగతి పరీక్షలు రాయాలనుకునే విద్యార్థులకు వారే నిర్ణయం తీసుకుని అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఇంగ్లీష్ మీడియంలో పరీక్షలు రాయాలనుకునే వారు. నమోదు చేసుకునే అవసరం లేదు. తెలుగులో రాయాలనుకునే వారు మాత్రమే ఆప్షన్ పెట్టుకోవాలని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. విద్యార్థులు ఎంత మంది తెలుగు మీడియాన్ని ఎంచుకున్నారో దానిని బట్టి పరీక్ష పేపర్లు రూపొందిస్తారు.

మూడు నెలల వరకు పింఛన్ తీసుకోవచ్చు

భీమవరం టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వం పెన్షన్ లబ్ధిదారులకు ఊరట కలిగేలా ఉత్తర్వులు జారీచేసింది. ఒకటి, రెండు నెలలు పెన్షన్ తీసుకోకపోయినా మూడో నెలలో మొదటి రెండు నెలల పెన్షన్ కలిపి తీసుకునే వెసులుబాటు కల్పిస్తూ జీవోను జారీచేసింది. ఈ నెల నుంచే అమలు జరిగేలా ఉత్తర్వుల్లో పేర్కొ న్నారు. ఈ నిర్ణయం జిల్లాలోని పెన్షన్‌దారులకు పెద్ద ఊరట. ప్రతీ నెలా పింఛన్ ఇచ్చే సమయానికి పింఛన్‌దారులు ఎక్కడున్నా తమ ఇళ్లకు వచ్చేవారు. ఒకవేళ అత్యవసర పరిస్థితుల్లో రాకపోతే ఆ నెల పెన్షన్‌ను కోల్పోయేవారు. ఇప్పటికే వేలాది మంది ఇలా పింఛన్లను నష్టపోయారు.



తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గృహ వినియోగదారులకు సబ్సిడీపై అందించే వంట గ్యాస్ పక్కదారి పడుతోంది. కమర్షియల్ గ్యాస్‌ను వినియోగించాల్సిన వ్యాపారులు వీటిని వాడడంతో ఈ సమస్య ఎదురవుతోంది. జిల్లాలో భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, నరసాపురంతోపాటు అత్తిలి, గణపవరం, ఉండి, పెనుగొండ ఆచంట తదితర పట్టణాల్లో పెద్ద సంఖ్యలో రెస్టారెంట్‌లు, బేకరీలు, టీ స్టాల్స్ ఉన్నాయి. వీటితోపాటు గ్రామాల్లో పదుల సంఖ్యలో వ్యాపార సముదాయాలు ఉన్నాయి. వీరు కచ్చితంగా కమర్షియల్ గ్యాస్ సిలిండర్లనే వినియోగించాలి. కానీ డొమెస్టిక్ సిల్లిండర్లను వినియోగిస్తున్నారు. తాడేపల్లిగూడెం రూరల్ ప్రాంతంలోని ఓ గ్యాస్ కంపెనీలో 2,500 డొమెస్టిక్ గ్యాస్ కనెక్షన్‌లు వుంటే అందులో ఆరు మాత్రమే కమర్షియల్ కనెక్షన్‌లు. అంటే కమర్షియల్ కనెక్షన్‌లు లేకుండా వ్యాపారాలు సాగిస్తున్నారని తేట తెల్లమవుతోంది.

వంట గ్యాస్‌కు వ్యాపారుల మంట

కమర్షియల్ సిలిండర్ల స్థానంలో సబ్సిడీ వంట గ్యాస్

» బయటమార్కెట్‌లో ఇబ్బడిముబ్బడిగా వినియోగం
» అధికారులు దాడులు చేస్తుంటే.. దొరుకుతున్న వ్యాపారులు
» సబ్సిడీ సిలిండర్లపై మాఫియా కన్ను..
» ప్రభుత్వ ఖజానాకు కోట్లలో తూట్లు



తాడేపల్లిగూడెంలో దుకాణంలో గ్యాస్ సిలిండర్లు సీజ్ చేసిన తహశీల్దార్ (ఫైల్)

భీమవరంలో ఇటీవల అధికారులు రెస్టారెంట్‌ను తనిఖీ చేసి అక్రమంగా వినియోగిస్తున్న తొమ్మిది వంట గ్యాస్ సిలిండర్లను సీజ్ చేశారు. తాడేపల్లిగూడెం తహశీల్దార్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో కమర్షియల్ దుకాణాల్లో తనిఖీ చేస్తే ఓ దుకాణంలో వంట గ్యాస్‌తో వ్యాపారం చేస్తున్నట్టు గుర్తించారు. అక్కడ 19 సిలిండర్‌లను సీజ్ చేశారు. ఇటీవల మొగల్తూరు, పాలకొల్లు ప్రాంతాల్లో గ్యాస్ సిలిండర్లను పట్టుకున్నారు. జిల్లాలో ఉన్న సబ్సిడీ గ్యాస్‌నే ఈ విధంగా ఏమారుస్తుంటే ప్రభుత్వం ఏడాదికి ఇచ్చే మూడు సిలిండర్లను ఇంకెంత ఏమారుస్తారో నని సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు పక్కదారి పడుతున్న గ్యాస్‌ను పట్టుకునేందుకు ఒకసారి మార్కెట్‌లో మాటు వేస్తే ఇట్టే దొరికి పోతారు. ఒక పక్క గ్యాస్‌ను కార్లకు ఎక్కించడం నుంచి గ్యాస్ లైట్లు ఇలా చాలా వాటికి ఈ గ్యాస్‌నే ఎక్కిస్తూ ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారు.

5.61 లక్షల సబ్సిడీ సిలిండర్లు

జిల్లాలో ఆరు లక్షల 21 వేల గ్యాస్ సిలిండర్ల గృహ వినియోగదారులు ఉన్నారు. వీటిలో 5.61 లక్షల సిలిండర్లను సబ్సిడీపై ఇస్తున్నారు. వీటిలో పది శాతం కూడా కమర్షియల్ గ్యాస్ కనెక్షన్‌లు లేవు. ఇందుకు ప్రధానంగా 14 కేజీల గృహ వినియోగదారుల గ్యాస్ సిలిండర్ ధర రూ.833 కాగా, 19 కేజీల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.1,850 పలకడమే కారణం. ఈ లెక్కన జిల్లావ్యాప్తంగా కోట్లాది రూపాయలు ప్రభుత్వ ఖజానాకు గండి పడుతోంది. 'ప్రభుత్వం సబ్సిడీతో అందించే 14 కేజీల గృహ వినియోగదారుల గ్యాస్ సిలిండర్ ధర రూ.833 కాగా, 19 కేజీల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.1,850. ఈ ధరల వ్యత్యాసం వల్ల ఎక్కువగా ఈ కనెక్షన్‌లు ఉపయోగిస్తున్నారు. వాటిపై ఎప్పటికప్పుడు నిఘా పెడుతున్నాం. సమాచారం మేరకు దాడులు చేస్తున్నాం' అని తాడేపల్లిగూడెం తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్ తెలిపారు.

104 వాహనాలకు మందుల కొరత

» సీజనల్ వ్యాధులకు అంతంతమాత్రమే
» బీపీ, షుగర్ మందులు మాత్రమే పుష్కలం



భీమవరం టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): 104 వాహనాల్లో మందుల కొరత ఏర్పడింది. సీజనల్ వ్యాధుల మందులు అనుకున్నంతగా అందుబాటులో లేవు. జిల్లాకు కావాల్సిన మందులకు ఇండెంట్ పెడుతున్నా పూర్తిస్థాయిలో ఇవ్వడం లేదు. కేవలం బీపీ, షుగర్ మందులు మాత్రమే పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయి. సీజనల్ జ్వరాలు, జలుబు, ఒళ్లు నొప్పులు, చర్మవ్యాధులకు సంబంధించిన మందులు, ఆయింట్‌మెంట్లు, దగ్గు సిరప్‌లు అరకొరగా ఇస్తున్నారు. జ్వరాలకు ఇచ్చే డోలో-650 టాబ్లెట్స్ జిల్లాకు 50 బాక్సులు కూడా రాలేదు. దగ్గు సిరప్‌లు మొత్తంగా 50 బాటిల్స్ మాత్రమే వచ్చాయి. ఇవి 15 రోజులు కూడా రావు. తర్వాత ఏమిటో తెలియడం లేదు. జిల్లా అంతటా తిరిగే వాహనాలకు ఈ మందులు కొద్దిరోజులకే సరిపోతాయి. ఇండెంట్‌లో వచ్చే మందులను జాగ్రత్తగా వాడుకుని, మళ్లీ ఇండెంట్ పెట్టే వరకు ఉంచుకోవాలి. జిల్లాలో 104 వాహనాలు 33 ఉండగా వీటన్నింటికి ఇండెంట్ పెట్టి మందులను పంచాల్సి వస్తోంది. అనుకున్న స్థాయిలో మందులు రాకపోవడంతో పరిస్థితి దారుణంగా ఉంది. జిల్లాలో 104 వాహనాలకు కావాల్సిన మందులకు సంబంధించి ఇండెంట్ మూడు నెలలకు ఒకసారి పెట్టాల్సి వస్తోంది. మొదట్లో నెలాఖరున ఇండెంట్ పెట్టేవారు. అప్పట్లో కావాల్సిన మందులు వచ్చేవి. గత ప్రభుత్వ హయాంలో మూడు నెలలకు ఒకసారి మాత్రమే ఇండెంట్ తీసుకుంటున్నారు. వారి దగ్గర ఉన్న మందులకు సంబంధించి ఇండెంట్ ఇస్తారని, అందులో ఎంచుకుని పెడితే అవి కూడా అరకొరగానే ఇస్తున్నారు. మందులు తక్కువగా ఇవ్వడం వల్ల క్యాంపులు పెట్టాలంటే కొంత ఆందోళనగా ఉంటున్నది.



పీహెచ్‌సీల నుంచి ఇస్తాం

104 వాహనం ద్వారా వైద్య సేవలకు కావలసిన మందులు లేకపోతే తాత్కాలికంగా దగ్గరలో వున్న పీహెచ్‌సీల ద్వారా సర్దుబాటు చేస్తాం. వారికి మందులు వచ్చినపుడు తిరిగి ఇచ్చేలా మాట్లాడతాం. రేలంగి నుంచి బీపీ, షుగర్ మందులు తక్కువగా ఉన్నాయి. వారు ఇండెంట్ పెట్టుకుని రప్పించుకున్నారు. మందుల కొరతపై వివరాలు తెలుసుకుని చర్యలు తీసుకుంటాం.

- డీఎంహెచ్‌వో డాక్టర్ మహేశ్వరరావు

పట్టిసీమ నుంచి 6,372 క్యూసెక్కుల జలాలు విడుదల

పోలవరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి గురువారం 6,372 క్యూసెక్కుల జలాలు పోలవరం ప్రాజెక్టు కుడి కాల్వకు విడుదల చేశారు. 18 మోటార్లను ఆన్ చేసి 18 పంపుల ద్వారా నీటిని పంపింగ్ చేశారు.

అమృత్‌కు మోక్షం

» ప్రభుత్వానికి చేరుకున్న డీపీఆర్‌లు
» జిల్లాలో రూ.250 కోట్ల విలువైన పనులు
» పురోగతిలో తాడేపల్లిగూడెం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న అమృత ప్రాజెక్టులకు మళ్లీ కదలిక వచ్చింది. జిల్లాలో అమృత 2.0లో రూ.250 కోట్లతో పనులకు ప్రణాళిక సిద్ధం చేశారు. భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నర్సాపురం, ఆకివీడు పట్టణాలలో తాగు నీరు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధికి నిధులు వెచ్చించనున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర ప్రాజెక్టు నివేదికను సమర్పించారు. మున్సిపల్ చీఫ్ ఇంజనీర్ వద్ద ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయి. అనుమతుల కోసం అధికారులు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన వెంటనే టెండర్లు పిలుస్తారు.



తాడేపల్లిగూడెం చేరిన పైపు లైన్లు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

వాస్తవానికి గత ప్రభుత్వ హయాంలోనే అమృత్ 2.0లో ప్రాజెక్టులు మంజూరయ్యాయి. ప్రతిపాదనలు పంపడానికి ప్రభుత్వం అనుమతులు ఇవ్వలేదు. ఫలితంగా ప్రాజెక్టులు పడకవేశాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమృత్‌పై దృష్టి పెట్టారు. జిల్లాలోని అన్ని పట్టణాల్లోనూ మంచినీటి వ్యవస్థను అభివృద్ధి చేసే పనులపై దృష్టి పెట్టారు. అందులో భీమవరం, తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలకు అత్యధికంగా నిధులు మంజూరయ్యాయి. పనులకు ప్రణాళికలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద సమగ్ర ప్రాజెక్టు నివేదికలకు అనుమతులు మంజూరైన వెంటనే ఇతర మున్సిపాలిటీల్లోనూ పనులకు టెండర్లు పిలవనున్నారు.

రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్

తాడేపల్లిగూడెంలో పదేళ్ల తర్వాత కడియపు చెరువును రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌గా తీర్చిదిద్దుతున్నారు. మొత్తం 54.93 ఎకరాల్లో రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును నిర్మించనున్నారు. డిజైన్లు సిద్ధమయ్యాయి. ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. తుది పరిశీలన తర్వాత పనులు ప్రారంభించనున్నారు. ఏలూరు కాలువ నుంచి రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులోకి పైపు లైన్ల ద్వారా నీటిని మళ్లిస్తారు. వేసవిలో అక్కడి నుంచి మళ్లీ తాడేపల్లిగూడెం పంపుల చెరువుకు పైపులైన్లతో నీటిని సరఫరా చేస్తారు. పంపుల చెరువు వద్ద శుద్ధి చేసిన నీటిని పట్టణ ప్రజలకు అందించనున్నారు. దీని నిర్మాణానికి పైపులైన్‌కు అవసరమైన పైపులు పట్టణానికి చేరుకున్నాయి. కడియపు చెరువులో నీటిని బయటకు తోడేశారు. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి.

మున్సిపాలిటీలలో నిధుల కొరత

అమృత్ ప్రాజెక్టులో కేంద్ర ప్రభుత్వం 50 శాతం నిధులు కేటాయిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం భరిస్తుంది. మిగిలిన 20 శాతం మున్సిపాలిటీలు సమకూర్చుకోవాలి. జిల్లాలోని అన్ని పట్టణాలకు మంజూరైన రూ.250 కోట్ల నిధులలో మున్సిపాలిటీలు రూ.50 కోట్లు వెచ్చించాలి. దీనికితోడు జీఎస్టీ మున్సిపాలిటీలు భరించాలి. ఆ లెక్కన మున్సిపాలిటీలు మరో రూ.24 కోట్లు పన్నుల రూపంలో వెచ్చించాలి. మొత్తంగా అమృత్ ప్రాజెక్టులో మున్సిపాలిటీలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిధులను కేటాయించి ఆదుకోవాలి. లేదంటే ప్రాజెక్టుల నిర్మాణం కష్టతరం కానుంది.



నిర్మాణానికి సిద్ధంగా వున్న రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ చెరువు

అపార్ నమోదు పూర్తి చేయాలి

» కలెక్టర్ నాగరాణి



భీమవరం టౌన్/రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):అపార్ నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ వార్డు అడ్మిన్ సెక్రటరీలతో గుగూల్ మీట్ నిర్వహించారు. నమోదు ప్రక్రియ వెనుకబడి ఉన్న వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో 2.47 లక్షల మంది బ్యాంకు ఖాతాలు కలిగి ఉండగా ఇప్పటి వరకు 83 వేల మందికి మాత్రమే ఎన్‌పీసీఐ బ్యాంక్ ఖాతాకు అనుసంధానం చేశారని, ఇంకా 1.65 లక్షల మంది ఖాతాలకు అనుసంధానం చేయాలన్నారు.

అనారోగ్యంతో అప్పులపాలు కాకూడదు

ఏ ఒక్కరు అనారోగ్య కారణంగా అప్పులపాలు కాకూడదనే లక్ష్యంతో ప్రభుత్వ వైద్యులు బాధ్యతాయుతంగా వైద్య సేవలను అందించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. గురువారం త్యాగరాజు కల్యాణ మండపంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖల అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. వైద్య ఆరోగ్య, ఐసీడీఎస్ శాఖల పనితీరు టార్గెట్స్‌ను సమీక్షించారు. టార్గెట్స్ పూర్తవ్వని మండలాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్దీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

తొలి చోరీ సక్సెస్.. రెండోసారి దొరికేశారు

» దుబాయ్ వెళ్లి అప్పుల పాలయ్యారు..
» తీర్చుకునేందుకు చోరీల బాటపట్టారు
» ముగ్గురిని పట్టుకున్న పోలీసులు

దారి దోపిడీ చేస్తున్న ఇద్దరు దొంగల అరెస్ట్

బలవంతపు విడాకులు ఇప్పించిన రెండు గ్రామాల పెద్దలపై కేసు నమోదు

శబరిమలై వెళ్లేందుకు ప్రత్యేక రైళ్లేవీ?

■ వివరాలు 7వ పేజీలో..

అంతా మా ఇష్టం..

ట్రాఫిక్ నిబంధనలు గాలికి..







'ఎవరు అడ్డొస్తే మాకేంటి.. మా దారి రహదారి' అంటూ కొందరు వారికి ఇష్టం వచ్చినట్టు ఏలూరు నగర రోడ్లపై దూసుకుపోతున్నారు. అడ్డదిడ్డంగా ప్రయాణిస్తూ రోడ్డుపై వెళ్తున్న ప్రయాణికులకు ఇబ్బందులు సృష్టిస్తున్నారు. ఇక్కడ కనిపిస్తున్న దృశ్యాలన్నీ గురువారం ఏలూరు నగరంలో ఆంధ్రజ్యోతి కెమెరాకు చిక్కినవే.. జూట్‌మిల్, ఫైర్‌స్టేషన్ సర్కిళ్లలో సిగ్నల్స్ వెలుగుతున్నా అడ్డదారిలో వెళ్లిపోతున్నారు. వీరిని చూసి కొంత మంది అంత తొందర ఎందుకు అంటూ ప్రశ్నించినా తమకేమీ పట్టనట్టుగానే బైక్‌ల వేగం పెంచుతున్నారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)





ఏలూరులో అలా ఉంటే భీమవరంలో మరోలా ఉంది.. 'సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరం.. రెప్పపాటులో ప్రమాదం జరిగిపోతుంది.. ఇలా డ్రైవింగ్ చేయడం నేరం కూడా.. జరిమానా, జైలుశిక్ష కూడా ఉంటుంది' అని తెలిసినా ఎవరూ పట్టించుకోవడం లేదు.. ట్రాఫిక్ నిబంధనలు తమకు కాదన్నట్టుగా వెళ్లిపోతున్నారు.. గురువారం భీమవరంలో పలు సెంటర్లలలో కనిపించిన దృశ్యాలివి..

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో ఐదుగురు

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణలు

వచ్చేనెల 5న పోలింగ్.. 9న కౌంటింగ్

కాకినాడ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణలు గురువారం ముగిశాయి. ఒకే ఒక్క అభ్యర్థి నామినేషన్ ఉపసంహరణ చేసుకోగా ఎన్నికలబరిలో ఐదుగురు అభ్యర్థులు నిలిచారు. ఎన్నికల బరిలో నిలిచినవారిలో బుర్రా గోపి మూర్తి, గంధం నారాయణరావు, నామన వెంకటలక్ష్మి, కవల నాగేశ్వరరావు, షులుగు దీపక్ ఉన్నారు. ఇక నుంచి వీరు ఎన్నికల ప్రచారంలో నిమగ్నమవ్వనున్నారు. వచ్చేనెల 5న పోలింగ్ జరగనుంది. 9న కౌంటింగ్ జరగనుంది. దీనికి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తుంది. మొత్తంగా 16,316 మంది ఓటు హక్కు విని యోగించుకోనున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 614 మంది, తూర్పుగోదావరి జిల్లాలో 2893 మంది, ఏలూరు జిల్లాలో 2605 మంది, కాకినాడ 3333 మంది, కోనసీమ 3209 మంది, పశ్చిమ గోదావరి 3662 మంది ఓటర్లు ఉన్నారు. ఆరు జిల్లాల పరిధిలో 116 పోలింగ్ కేంద్రాలు ఉండగా, దీనిలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో 12, తూర్పుగోదావరి జిల్లాలో 20, ఏలూరు జిల్లాలో 20, కాకినాడ జిల్లాలో 22, కోనసీమ జిల్లాలో 22, పశ్చిమగోదావరి జిల్లాలో 20 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.



వైభవంగా మావుళ్లమ్మ జ్యోతియాత్ర

భీమవరంటౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) మావుళ్ళమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమ్మవారి దీక్షల్లో భాగంగా గురువారం రాత్రి మాలధారులతో జ్యోతియాత్ర చేపట్టారు. సాయంత్రం ఆలయం వద్ద మాలధారులతో ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లిఖార్జున శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాదాపు 400 మంది మాలధారులు జ్యోతులను చేతపట్టుకుని మావుళ్ళమ్మ శరణు ఘోషతో, మంగళ వాయిద్యాలతో ప్రత్యేకంగా తయారుచేసిన వాహనంలో అమ్మవారి ఫొటో ఉంచి యాత్ర నిర్వహించారు. ఆలయం నుంచి బయలు దేరి ప్రధాన వీధుల మీదుగా చివరగా అమ్మవారి ఆలయానికి చేరుకుని అమ్మవారికి జ్యోతులను సమర్పించారు. ఈవో బుద్దమహాలక్ష్మి నగేష్ పర్యవేక్షించారు.



తపాలా బిళ్లపై విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తున్న దృశ్యం

తపాలాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు

భీమవరం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):స్వతంత్ర భారతదేశపు మొట్టమొదటి తపాలా బిళ్ళ 1947 నవంబరు 21న విడుదలయ్యాయని, దీని విలువ మూడున్నర అణాలని హెడ్ పోస్టు మాస్టర్ రాజు, అసిస్టెంట్ పోస్టు మాస్టర్ నాగమణి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో భీమవరం పోస్టల్ శాఖ కార్యాలయంలో స్వతంత్ర భారతదేశపు మొట్ట మొదటి తపాలా బిళ్ళ విడుదలైన సందర్భంగా విద్యార్థులకు పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. తపాలా బిళ్ళలు తపాలా వ్యవస్థలో ఒక ముఖ్యమైన భాగమని అన్నారు. తపాలా వ్యవస్థ ద్వారా పంపే లేఖలు, ఇతర సామగ్రి సంఖ్యను గణనీయంగా పెంచిందన్నారు. అనంతరం విద్యార్థులకు పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. పోస్టల్ పీఆర్వో సత్యనారాయణ, యూనియన్ నాయకులు లెనిన్, చెరుకువాడ రంగసాయి, పోస్టల్ ఆఫీసర్ వెంకటరత్నం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఊరంతటికీ ఈ నుయ్యే ఆధారం



ఆచంట వేమవరంలో ఉన్న సీతమ్మ నుయ్యి

వందల సంవత్సరాల నాటి బావులు శిథిలావస్థకు చేరి ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. మారిన జీవన విధానంతో పాటు భూగర్భ జలాల్లో వచ్చిన మార్పుల కారణంగా బావుల నీటిని వినియోగించేవారు తగ్గిపోయారు.పూర్వం చెరువులు ఉన్నప్పటికి మంచి నీటి కోసం గ్రామంలో ఒక చోట పెద్ద నుయ్యి ఏర్పాటు చేసి బండరాళ్ళతో చుట్టు రక్షణ గోడలను కట్టేవారు. గ్రామస్థులంతా

కనుమరుగవుతున్న బావులు

నుయ్యిలోని నీటినే తాగునీటిగా ఉపయోగించే వారు. ఊరందరికి ఇటువంటి బావులు ఎంతగానే ఉపయోగపడేవి. ఆచంట వేమవరం పంచాయతీ వద్ద ఉన్న సీతమ్మ నుయ్యి 1822లో గ్రామంలో ఏర్పాటు చేశారు. ఈ బావికి 200 ఏళ్ళ చరిత్ర ఉంది. ప్రస్తుతం ఈ నుయ్యి పూర్తిగా పాడైపోయింది. 2018లో గ్రామానికి చెందిన వరదాచార్యులు, సత్యకుమారి కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో ఈ నుయ్యిని పునర్‌నిర్మాణం చేపట్టారు.నుయ్యిలను శుభ్రం చేసి కాపాడుకుంటే తాగునీటి కొరత ఉండదని పలువురు భావిస్తున్నారు. చాలా గ్రామాల్లో ఉన్న నుయ్యిలు ప్రస్తుతం కనుమరుగయ్యాయి. ఏళ్ళనాటి బావులను శుభ్రం చేసుకుని కాపాడుకుంటే తాగునీటి సమస్య ఉండదని పలువురు అంటున్నారు.

- ఆచంట/ఆంధ్రజ్యోతి

గజ.. గజ



జంగారెడ్డిగూడెంలో చలిమంట కాగుతూ..

ఏలూరుసిటీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): చలి గాలులు చంపేస్తున్నాయి. సాయంత్రం అయ్యేసరికి చలి తీవ్రత ఉగ్రరూపం దాలుస్తోంది. నాలుగు రోజులుగా రాత్రిపూట ఉష్ణోగ్రతలు తీవ్రంగా పడిపోతున్నాయి. గురువారం ఏలూరు జిల్లాలో చలి తీవ్రత రాత్రి సమయంలో 17 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు నమోదు అవుతోందని ఇంటర్‌నెట్ సమాచారం ద్వారా తెలుస్తోంది. జిల్లాలోని ఏజెన్సీ మండలాల్లో రాత్రి సమయాల్లో చలిని తట్టుకోవడం ప్రజలకు కష్టతరంగా తయారైంది. చలిని తట్టుకోలేక అనారోగ్యాల పాలవుతున్నారు. చలి తీవ్రత కారణంగా శ్వాసకోశ సంబంధ వ్యాధులతో పాటు జలుబు, జ్వరం భారిన పడుతున్నారు. పగటి పూట ఉష్ణోగ్రతలు 31 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు నమోదు అవుతున్నా రాత్రి పూట ఉష్ణోగ్రతలు మాత్రం కనిష్ట స్థాయికి పడిపోయాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సారి నవంబరు నెలలోనే కనిష్ట ఉష్ణోగ్రతలు తారస్థాయికి పడిపోయాయి. నవంబరు 18 వతేదీ నుంచి 21 వతేదీ వరకు పరిశీలిస్తే జిల్లాలో రాత్రి పూట ఉష్ణోగ్రతలు 17 డిగ్రీల సెంటీగ్రేడ్ నుంచి 19 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు నమోదయ్యాయి. రాబోయే రోజుల్లో ఈ ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతాయని వాతావరణ శాఖాధికారులు చెబుతున్నారు. జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో మరింత ఎక్కువగా చలిగాలులు వీస్తున్నాయని చెబుతన్నారు.రాత్రి సమయాల్లో జనం బయటకు రావటానికే భయపడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఏజెన్సీ మండలాలతో పాటు గోదావరి పరివాహక ప్రాంతాలైన విలీన మండలాల్లోను, జంగారెడ్డిగూడెం పట్టణంలోను , కృష్ణా పరివాహక ప్రాంతాలలోను రాత్రి పూట చలి తీవ్రత విపరీతంగా పెరిగింది.

బయటకు రావడం లేదు

తెల్లవారుజామున, పగటి పూట కూడా చలి తీవ్రత ఎక్కువగా ఉండ టంతో రైతులు పంటపొలాలకు వెళలేకపోతున్నారు. కూలీలు కూడా చలిని తట్టుకోలేక పనులకు ఆలస్యంగా వెళ్లాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి.రాత్రి సమయాల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణాలు



17 డిగ్రీలకు పడిపోయిన రాత్రి పూట ఉష్ణోగ్రతలు

నాలుగు రోజులుగా పెరిగిన చలిగాలులు

ఏజెన్సీలో చలితో గజగజ

వెంటాడుతున్న అనారోగ్యాలు

తగ్గాయి. రాత్రి సమయాల్లో రహదారులపై జనసంచారం అంతంత మాత్రంగానే ఉంటోంది. చలి తీవ్రతను తట్టుకోవటానికి ప్రజలు ఉన్ని దుస్తులను ఆశ్రయిస్తున్నారు. వారం రోజులుగా ఉన్ని దుస్తుల అమ్మకాలు కూడా పెరిగాయని వ్యాపారస్తులు చెబుతున్నారు. ఏలూరు నగరంతో పాటు జిల్లా లోని మిగిలిన పట్టణాలు,పలు మండల కేంద్రాల్లో ఉన్ని దుస్తుల దుకాణాలు వెలిశాయి.

జ్వరాల భయం

చలి తీవ్రత కారణంగా ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. ముఖ్యంగా రొంప, జ్వరం దగ్గులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గొంతు సంబంధిత వ్యాధులు ఎక్కువగా సంక్రమిస్తున్నాయని చెబుతున్నారు. చలిగాలుల కారణంగా రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనాలపై బయటకు ప్రయాణాలు తగ్గించారు. గత నాలుగు రోజుల్లో ఉష్ణోగ్రతల వివరాలు ఇవీ..

తేదీ	గరిష్ట / కనిష్ట
నవంబరు 18	31/19
నవంబరు 19	31/19
నవంబరు 20	31/18
నవంబరు 21	31/17

ఆరోగ్యానికి రక్షణ..ఉన్ని దుస్తులు



శీతాకాలంలో వీచే చలిగాలులకు జలుబు, దగ్గు, జ్వరం వస్తాయి. చలికాలంలో కూడా అనారోగ్యం పెరిగే ప్రమాదం ఉంది. చలిలోకి వెళ్తే సంపూర్ణ ఆరోగ్యవంతులు సైతం అనారోగ్యం భారినపడతారు. రగ్గులు, స్వెట్టర్లు మంకీ క్యాప్‌లు వాడటం వల్ల రక్షణ పొంద వచ్చు. చిన్నారులు ఎక్కువగా చలిగాలిలో తిరగ కుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. ఆక్వా చెరువుల మీద పనిచేసే రైతులు, కార్మికులు కూడా స్వెట్టర్లు వినియోగించాలి.

- సంతోష్ నాయుడు, ప్రభుత్వ వైద్యాధికారి, గణపవరం

అమ్మకాలు బాగానే ఉన్నాయి



మధ్యప్రదేశ్, రాజస్థాన్, కశ్మీర్, నేపాల్ తదితర రాష్ట్రాల నుంచి తీసుకొచ్చిన రగ్గులు, ఇతర ఉన్ని దుస్తులకు డిమాండ్ బాగానే ఉంది. అమ్మకాలు బాగా ఉండటంతో ఏటా గణపవరం ఇండియన్ బ్యాంకు సమీపంలో దుకాణాలు ఏర్పాటు చేస్తుంటాం. షాపుల్లో కంటే మా వద్ద తక్కువ ధరలు ఉండటం వల్ల ఈ ప్రాంత ప్రజలు ఇక్కడే కొంటారు. అమ్మకాలు ముగించుకుని ఫిబ్రవరి నెలలో తిరిగి మా స్వస్థలానికి వెళ్లిపోతాం.

-భగవాన్ సింగ్ , వ్యాపారి, మధ్యప్రదేశ్

చలి కాలపు నేస్తాలకు గిరాకీ

గణపవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పల్లెల్లో క్రమేపీ చలి తిరుగుతోంది. సాయంత్రం 4 దాటిచే చలిప్రభావం చూపుతుంది. తెల్లవారుజామున 4 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు దట్టమైన మంచు కురుస్తోంది. రగ్గులు, స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు బయటకు తీస్తున్నారు. లేనివారు కొనుగోలు చేస్తున్నారు. పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, నేపాల్, నుంచి వ్యాపారులు వచ్చి గణపవరం మెయిన్ రహదారిలో దుకాణాలు ఏర్పాటు చేసి వీటిని విక్రయిస్తున్నారు. రగ్గులు, స్వెటర్లు, మఫ్లలర్లు, మంకీక్యాంపులు, శాలువాలు, హ్యాండ్‌గ్లౌజ్‌ల అమ్ముతున్నారు.ప్రతీ ఏటా నవంబర్‌లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి ఇక్కడకు వ్యాపారులు వచ్చి ఫిబ్రవరి వరకు నాలుగు నెలల పాటు ఇక్కడే కుటుంబాలతో మకాం వేసి ఉన్ని దుస్తులు విక్రయిస్తారు. నవంబర్, డిసెంబర్, జనవరి నెలల్లో వీరి వ్యాపారం జోరుగా సాగుతుంది.



నాలుగు డబ్బులు సంపాదించుకుని స్వరాష్ట్రాలకు వెళ్లిపోతుంటారు. గత ఏడాదితో పోలిస్తే రగ్గులు, స్వెట్టర్లు, తదితర దుస్తుల ధరలు అధికంగానే ఉన్నాయి. సైజును బట్టి రగ్గులు రూ. 400నుంచి 800 వరకు, స్వెట్టర్లు రూ.400 నుంచి 500 వరకు విక్రయిస్తున్నారు. మఫ్లర్లు, మంకీక్యాప్‌లు రూ.40 నుంచి 80 వరకు విక్రయిస్తున్నారు.

పిట్ట కొంచెమే.. కూత ఘనం

రాష్ట్రాల రాజధాని పేర్లతో పాటు 500 పదాలు అనర్గళంగా చెబుతోన్న శ్రీజ

ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో దొడ్డనపూడికి చెందిన మూడేళ్ల చిన్నారి

కాళ్ళ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పిట్ట కొంచెం.. కూత ఘనం అన్నట్టుగా ఆ చిన్నారి మూడేళ్ల వయసులోనే అనర్గళంగా ఇంగ్లీషు పదాలు, అర్థాలు చెప్పి అందిరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అంతేకాదు.. ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాదించి శెభాష్ అనిపించుకుంది.. అ, ఆ..లు కూడా రాని ఆ చిన్నారి దేశంలోని అన్ని రాష్ట్రాలు, వాటి రాజధానులు పేర్లు ఇంగ్లీషులో చెప్పడంతో పాటు, మానవ శరీరంలోని అన్ని అవయవాల పేర్లను ఇంగ్లీషులో చెప్పేస్తోంది.చిన్నారి గ్రహించే శక్తిని, ప్రతిభా పాటవాలను గుర్తించిన తల్లితండ్రులు మరింత ప్రోత్సాహం ఇవ్వడంతో సుమారు 500 పదాలు ఇంగ్లీషులో చెప్పడంతో ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు సాధించింది. వివరాల్లోకి వెళితే కాళ్ళ మండలం దొడ్డనపూడి గ్రామానికి చెందిన కొల్లి శివ సత్యనారాయణ, నవ్యశ్రీ దంపతులకు ఇద్దరు అమ్మాయిలు.. పెద్ద అమ్మాయి విద్యాశ్రీవల్లి (ఐదేళ్లు) ఎల్‌కెజీ చదువుతోంది. చిన్న పాపకి జస్విక శ్రీజ (మూడేళ్లు). శివసత్యనారాయణ వ్యవసాయం చేస్తున్నారు. నవ్యశ్రీ డిగ్రీ చదివి గృహిణిగా ఉంది. సుమారు ఆరు నెలల క్రితం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి జస్వికశ్రీజను తీసుకు వెళ్లగా అక్కడ ఉన్న పుస్తకాలు, బొమ్మలను ఆసక్తికరంగా చూస్తూ వాటి పేర్లను అడిగి తెలుసుకుంది. చిన్నారి చెబుతున్న అంశాలను కాకతాలీయంగా ఫోన్లో చిత్రీకరించి ఆ తల్లి యూట్యూబ్ ద్వారా పోస్టు చేశారు. జస్వికశ్రీజ 60 జీవులు, 15 వాహనాలు, 11 దేవతామూర్తులు, 32 వస్తువులు, 5 లోహాలు, 22 గృహోపకరణాల పేర్లను గుర్తించడం, 15 రకాల పండ్లు, 33 కూరగాయలు, శరీరంలోని 37 భాగాలు, 14 వ్యతిరేక పదాలు, 6 ఆంగ్ల నర్సరీ రైమ్స్ చెప్పడం, 3 సంవత్సరాల వయసులో 1 నుంచి 20 వరకు లెక్కించడం, 13 తెలుగు పదాలను ఆంగ్లంలోకి అనువదించి చెప్పిన వీడియోలను చూసి అక్టోబరు 21న ఇండియా బుక్ ఆఫ్ రికార్డు (ఐబీఆర్) అచీవర్‌గా చిన్నారి పేరును నిర్ధారించినట్లుగా నిపుణులు బృందం నుంచి మెయిల్ రావడంతో వారి కుటుంబ సభ్యులు ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. హర్యానాకు రావాలని చెప్పడంతో వారి ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా రాలేమని చెప్పడంతో కొరియర్ ద్వారా మెడల్, సర్టిఫికెట్, ఐడీ కార్డు, ఇండియా ఆఫ్ రికార్డు పుస్తకం, బ్యాడ్జ్, పెన్, స్టిక్కర్లు వచ్చాయన్నారు. గ్రామ పెద్దలతో కలిసి వీటి అన్నింటినీ తీసుకుని జిల్లా కలెక్టర్ నాగరాణిని కలవగా చిన్నారిని అభినందనలతో ముంచెత్తినట్టు ఆనందంతో తెలిపారు.



ధ్రువీకరణ పత్రాలతో చిన్నారి జస్వికశ్రీజ



కలెక్టర్ నాగరాణిని కలిసిన చిన్నారి



కుటుంబ సభ్యులతో చిన్నారి శ్రీజ

24న బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు

ఏలూరు రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సీనియర్ పురుషుల బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు ఈనెల 24న మార్టేరు జడ్పీ హైస్కూల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కృష్ణారెడ్డి, గవ్వా శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 6 నుంచి 9వ తేదీవరకు మార్టురులో 10వ రాష్ట్రస్థాయి అంతర్‌జిల్లాల బాస్కెట్‌బాల్ పురుషుల, మహిళల, ఛాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పురుషుల జట్టు ఎంపిక, 24న మార్టేరులో నిర్వహిస్తున్నట్లు ట్రెజరర్ మురళీకృష్ణ తెలిపారు. వివరాల కోసం 94411 71933 నంబర్లో సంప్రదించాలని కోరారు.

28న కిడ్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలు

ఏలూరు రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఈనెల 8వ తేదీన ఏలూరు అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యాయ అధ్యక్షుడు జిల్లా వీరభద్రరావు పుట్టిన రోజును పురస్కరించుకుని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల మొదటి కిడ్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి దేవరపల్లి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 28న ఉదయం 8 గంటలకు ఎంపికలు జరుగుతాయన్నారు. అండర్-8,10,14,16,18 విభాగాల్లో బాల, బాలికలు పాల్గొనవచ్చన్నారు. విజేతలకు నగదు బహుమతి,మెరిట్ సర్టిఫికెట్, జ్ఞాపికలు అందచేస్తారన్నారు.వివరాలకు 62814 31202 నంబర్‌లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

శబరిమలైకు రైళ్లేవీ..

» జిల్లాకు మొండిచేయి » మచిలీపట్నానికి పెద్ద పీట » అయ్యప్ప భక్తుల్లో నిరాశ



నరసాపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఈసారి అయ్యప్ప కొండకు వెళ్లే భక్తుల కోసం దక్షిణ మధ్య రైల్వే ఎక్కువ సంఖ్యలో స్పెషల్ రైళ్లను ప్రకటించినప్పటికి జిల్లాకు మాత్రం మొండి చేయి చూపింది. కనీసం ఒక రైలు కూడా వేయలేదు. గతంలో నరసాపురం నుంచి నాలుగు ట్రిప్‌లు స్పెషల్ రైళ్లు వెళ్లేవి. ఈసారి ఇవన్నీ మచిలీపట్నం తరలిపోయాయి. దక్షిణమధ్య రైల్వే ప్రకటించిన 18 స్పెషల్ రైళ్లల్లో మచిలీపట్నం నుంచి ఐదు రైళ్లు ఉన్నాయి. కృష్ణాజిల్లాకు పెద్ద పీట వేసి గోదావరి జిల్లాలపై రైల్వే చిన్న చూపు చూపడం పట్ల భక్తులు మండిపడుతున్నారు. సాధారణంగా నరసాపురం, కాకినాడ నుంచి ఏటా స్పెషల్ రైళ్లు నడుస్తాయి. కాకినాడ నుంచి వెళ్లే రైళ్లు టీపీగూడెం, నరసాపురం నుంచి వెళ్లే రైళ్లు పాలకొల్లు, భీమవరం, కైకలూరులతో పాటు నరసాపురం సరిహద్దు నున్న కోనసీమ జిల్లాకు చెందిన భక్తులు నరసాపురం, పాలకొల్లు స్టేషన్ల నుంచి తరలి వెళుతుంటారు. ప్రత్యేక రైళ్లు వేస్తే ఇక్కడే ఫుల్ అయిపోతాయి. ఈ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఈసారి కూడా జిల్లా నుంచి ఎక్కువ రైళ్లు వేస్తారని భక్తులు ఎదురు చూశారు. కానీ రెండు స్టేషన్ల నుంచి ఒక్క రైలు కూడా వేయలేదు. దీంతో శబరిమలై వెళ్లే జిల్లా భక్తులు మచిలీపట్నం లేదా గుడివాడ వెళ్లి ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా జిల్లా ప్రజాప్రతినిధులు కల్పించుకుని రద్దీకి అనుగుణంగా జిల్లా నుంచి అయ్యప్పకొండకు ప్రత్యేక రైళ్లు నడిపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



కేంద్ర మంత్రి వర్మకు పితృవియోగం

హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తండ్రి సూర్యనారాయణరాజు మృతి చెందారు. భౌతికకాయానికి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి నివాళులర్పించి, అక్కడే వున్న కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఇంట్లోకి చొరబడి ఆభరణాల దోపిడీ

పెదవేగి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఒంటరిగా నివసిస్తున్న వృద్ధురాలి మెడలో బంగారు ఆభరణాలు చోరీ చేసిన సంఘటన పినకడిమిలో జరిగింది. ఎస్‌ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పినకడిమి గ్రామానికి చెందిన గంధం యాదగిరమ్మ అనే 70 ఏళ్ళ వృద్ధురాలు ఒంటరిగా నివసిస్తోంది. బుధవారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఇంట్లో టీవీ చూస్తుండగా గుర్తు తెలియని యువకుడు ఇంట్లో ప్రవేశించి, తలుపు గడియపెట్టి, వృద్ధురాలి మెడలో ఉన్న రెండు బంగారు గొలుసులను బలవంతంగా తెంపుకుని పారిపోయాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

రూ.3.60 లక్షలు నగదు, కారు, బైక్ స్వాధీనం

ద్వారకాతిరుమల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాజుపాలెంలో పేకాట స్థావరంపై గురువారం రాత్రి ద్వారకాతిరుమల పోలీసులు దాడి చేసి భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈదాడుల్లో ఐదుగురు పేకాటరాయుళ్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.3,60,500 నగదు, కారు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈదాడుల్లో భీమడోలు సీఐ యుజె.విల్సన్, ఎస్‌ఐ సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు. ఎస్‌ఐ సుధీర్ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే ఉపేక్షించబోయేదిలేదని హెచ్చరించారు. కోడిపం దేలు, పేకాట వంటివి నిర్వహిస్తే 112కు గాని లేదా 9440796653కి గాని తెలియపర్చాలని అన్నారు.



మాట్లాడుతున్న జేడీ ప్రసాద్

నదీ జలాలు కలుషితం కాకుండా చూడాలి

నరసాపురం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నదీ, సముద్ర జలాలు కలుషితం కావడం వల్ల మత్స్యకారులకు దొరికే మత్స్య సంపద హరించి పోతుందని, దీన్ని నివారించి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆర్డీవో దాసిరాజు అన్నారు. గురువారం పట్టణంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో ప్రపంచ మత్స్యకార దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మత్స్యశాఖ జేడీ ఆర్‌వీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి అనేక పథకాలు, సబ్సిడీలు అందిస్తుందన్నారు. అనంతరం సాగులో మంచి ఫలితాలు సాధించిన వారిని సత్కరించారు. జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు అండ్రాజు చల్లారావు, ఏడీ లక్ష్మీనర్సింహరాజు, ఎఫ్‌డీవో వివేక్ పాల్గొన్నారు. పట్టణంలోని ఫిష్ మార్కెట్ వద్ద మత్స్యనారాయణ స్వామికి పూలమాలలు వేశారు. పెమ్మాడి గణపతిరాజు, సంగాని వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

నాకు పిల్లల్ని దూరం చేయకండి

మృతురాలి భర్త ఆవేదన



తాడేపల్లిగూడెం రూరల్ నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తాను భార్యను కోల్పోయానని ఇప్పుడు పిల్లల్ని కూడా దూరం చేసేందుకు చూస్తున్నారని జగన్నాథపురంలో హత్యకు గురైన నాగశ్రావణి భర్త లక్కోజు శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. తాడేపల్లిగూడెం రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద శ్రీనివాస్ తన కుటుంబ సభ్యులతో గురువారం ఆవేదనను తెలియజేశాడు. తాను ఇంట్లో జరిగిన కొన్ని గొడవల వల్ల తన భార్యను కోల్పోయానని తన తండ్రి నాగేశ్వరరావు తెలిసి తెలియక చేసిన నేరానికి తాను అన్నింటికీ దోషిగా మిగిలానని ఇప్పుడు పిల్లల్ని కూడా చూడలేని పరిస్థితుల్లో ఉన్నానన్నారు. తన పిల్లలకు ఇస్తానన్న ఆస్తిని రాసిచ్చామని, అరెకరం పొలం కూడా సాంకేతిక సమస్య తీరిన తరువాత రాసేస్తానన్నారు. తమ కుటుంబాన్ని రోడ్డున పడేసిన పెద్దలు అంతా ఆలోచించాలని కోరారు. శ్రీనివాసరావు వెంట ఆయన తండ్రి కేశవరావు, అన్న నాగబాబు, తల్లి ఉన్నారు.

అప్పులు తీర్చేందుకు చోరీల బాట!

» ముగ్గురి అరెస్టు

నిడదవోలు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వృద్ధురాలిపై దాడి చేసి బంగారం చోరీ చేసిన కేసులో ముగ్గురు పోలీసులకు చిక్కి జైలుకెళ్లారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన చెల్లు బోయిన సత్యనారాయణ, తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలానికి చెందిన పాకా వీరాస్వామి అప్పులు చేసి దుబాయ్ వెళ్లారు. అక్కడ ఇద్దరూ ఒకే రూమ్‌లో కలిసి ఉండేవారు. దీంతో స్నేహితులయ్యారు. దుబాయ్‌లో వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో ఇటీవల తిరిగి ఇండియాకు వచ్చేశారు. అయితే అప్పులు తీర్చే మార్గం కానరాలేదు. మరో వైపు చెడు వ్యసనాలు.. దీంతో పాకా వీరాస్వామి ఉల్లిపాయల వ్యాపారం చేస్తూ ఈ నెల 6వ తేదీన నిడదవోలు గాంధీనగర్‌లో ఒక వృద్ధురాలు ఒంటరిగా నివసించడం గమనించాడు. ఈ విషయం స్నేహితుడు సత్యనారాయణకు చెప్పాడు. వృద్ధురాలిపై దాడి చేసి బంగారం ఎత్తుకుపోయేలా ప్లాన్ వేశారు. ఈ మేరకు మరో స్నేహితుడు పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలానికి చెందిన సమ్మింగి సన్యాసిరావు సహాయం తీసుకున్నారు. ఈ నెల 8వ తేదీన ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలు నూలి అన్నపూర్ణమ్మపై దాడిచేసి బంగారం దోచుకు పోయారు. ఇది సక్సెస్ కావడంతో బుధవారం మళ్లీ మరో నేరం చేయ డానికి ప్రణాళిక వేసేందుకు నిడదవోలు రాగా పోలీసుల నిఘా మేరకు పట్టుకున్నారు. సీఐ తిలక్, ఎస్‌ఐ శోభన్ కుమార్ చోరీ చేసిన బంగారాన్ని రికవరీ చేశారు. ముగ్గురుని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పర్చినట్టు తెలిపారు.



కానిస్టేబుల్ విష్ణు రక్తదానం

చాట్రాయి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రైవేటు హాస్పటల్‌లో 16 నెలల చిన్నారి గుండె ఆపరేషన్‌కి సింగిల్ డోనర్ ప్లేట్స్ కోసం ఏబీ రక్తదాత కావలెనని సోషల్ మీడియాలో వచ్చిన ప్రకటన చూసిన చాట్రాయి పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ విష్ణు హుటాహుటిన బెజవాడ వెళ్ళి రక్తదానం చేశారు. చిన్నారి గుండె ఆపరేషన్‌కు రక్తదానం చేసిన విష్ణుని ఎస్సై రామకృష్ణ, పోలీస్ సిబ్బంది అభినందించారు.

క్రైమ్ కార్నర్



రైలు పట్టాలపై పడి ఉన్న వృద్ధుడు

వృద్ధుడి అనుమానాస్పద మృతి

ఏలూరు క్రైం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఏలూరు సమీపంలోని వట్లూరు రైల్వే స్టేషన్ దగ్గరలో రైలుపట్టాలు పక్కన ఒక వృద్ధుడు పడి ఉన్నాడని 108 అంబులెన్స్‌కు సమాచారం అందింది. దీంతో ఏలూరు 108 అంబులెన్సు సిబ్బంది హుటాహుటీన వెళ్ళి వెంటనే ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. వచ్చిన కొద్దిసేపటికే అతను మృతి చెందాడు. వట్లూరుకు చెందిన ఇంటూరి సత్యనారాయణ (72) గురువారం ఉదయం తన ఇంటి నుంచి బహిర్భూమికి వెళ్ళాడు. రైలు పట్టాలుపక్కన అతను అనుమానాస్పదంగా పడి ఉన్నాడు. ఏదైనా రైలు ఢీకొందా లేదా మరే ఇతర అనారోగ్య కారణంతో పడిపోయాడా అనే విషయాలు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈ సంఘటనపై ఏలూరు రైల్వే ఎస్‌ఐ పి.సైమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

11 కాసుల బంగారం అపహరణ

ఏలూరు క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇంటిలో ఉన్న బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయని ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశారు. ఏలూరు ఆదివారపుపేటకు చెందిన పేరూరి సుకన్య తమ కుటుంబ సభ్యులు ఒక స్టేషనరీ షాపు నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది అక్టోబర్ 8వ తేదీన ఉదయం 9 గంటలకు సుకన్య ఆమె భర్త ఇంటికి తాళం వేసుకుని స్టేషనరీ షాపునకు వెళ్ళిపోయారు. 10.30 గంటలకు ఆమె అత్తగారు వచ్చి ఇంట్లో తలుపులు దగ్గరకు వేసి పడుకున్నారు. ఆ తరువాత ఇంట్లో పెట్టిన 11 కాసుల బంగారు ఆభరణాలు కనిపించడం లేదు. గురువారం ఏలూరు టూటౌన్ పోలీసులకు సుకన్య ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురికి గాయాలు

భీమవరం క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనంపై వెళుతున్న ఒక కుటుంబాన్ని పక్కనే వెళుతున్న మరో మోటార్ సైక్లిస్టు ఢీకొట్టిన ప్రమాదంలో గాయాలు అయ్యాయి. పట్టణానికి చెందిన బూరా మోహన రవితేజ అతని భార్య కలిసి కుమారిడిని పాఠశాల నుంచి తీసుకురావడం కోసం ఈనెల 20వ తేదీన వెళ్ళారు. తిరిగి ముగ్గురు వస్తుండగా పక్కనే బస్తాలతో వెళుతున్న మోటార్ సైక్లిస్టు వీరి వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో ముగ్గురు కిందపడి గాయాల పాలయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రహమాన్ తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం

కాపాడిన కానిస్టేబుల్



కానిస్టేబుల్ నాగేశ్వరరావు

పెనుమంట్ర, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న వృద్ధురాలు తనువు చాలించాలని ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. మాముడూరుకి చెంది న(65) సంవత్సరాల వృద్ధురాలు మాముడూ రు కాలవలోకి దూకి ఆత్మహత్యాయత్నం ప్రయత్నించింది సమాచారం అందుకున్న కాని స్టేబుల్ పి.నాగేశ్వరరావు సంఘటన స్థలానికి చేరి వృద్ధురాలను కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సమయ స్ఫూర్తితో వృద్ధురాలను కాపాడిన ఈ సంఘటనతో ఉన్నతాధికారులు నాగేశ్వరరావును అభినం దించారు

నడిపూడి ఇసుక ర్యాంపు అక్రమాలు పట్టవా..

» రోడ్డుపై బారులు తీరిన లారీలు.. » గ్రామస్థులకు అవస్థలు



రహదారికి అడ్డుగా పెట్టిన లారీలు

పెనుగొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దళారులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా నడిపూడి ఇసుక ర్యాంప్‌లో పరిస్థితి ఉన్నది. ఇసుక ర్యాంప్‌లో జరుగుతున్న అక్రమాలపై అధికారులు పట్టనట్లు వ్యవహరించడంపై దళారులు ఇష్టారాజ్యంగా మారింది. ఇంత జరుగుతున్న మైనింగ్, రెవెన్యూ, ఇరిగేషన్, విజిలెన్స్ అధికారులు పత్తా లేకుండా పోవడంతో పలు అనుమానాలకు దారి తీస్తున్నది. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నడిపూడి ఇసుక ర్యాంప్‌కు వెళ్లేందుకు లారీలు ఏటిగట్టు, రహదారులపై కిలో మీటర్లు మేర రహదారికి అడ్డుపెట్టారు. సిద్ధాంతం లంక భూములకు వెళ్లే రైతులు, శ్మశాన వాటికకు దహన సంస్కారాలకు చేసేందుకు మృతదేహాలను తీసుకెళ్ళే వారు అవస్థలు పడ్డారు.

బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాలతో జాగ్రత్త



ఎస్పీకి పాలకోడేరు పోలీసుల గౌరవ వందనం

పాలకోడేరు, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): పాలకోడేరు పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ అద్నాన్ నయిమ్ అస్మి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు, కేసుల డైరీ, విలేజ్ రోస్టర్, వివిధక్రైమ్ రికార్డులను పరిశీలించారు. బ్లాక్‌స్పాట్స్ దగ్గర రోడ్డు ప్రమాదం జరగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రంకెన్ డ్రైవ్, రోడ్డు భద్రతా నియమాలపై కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన కల్పించేలా చూడాలని సూచించారు. హత్యలు, హత్యాయత్నాలు, క్రైమ్ ఎగనెస్ట్ ఉమెన్, గర్ల్ మిస్సింగ్, ప్రోపర్టికేసులు, రోడ్డు ప్రమాదాలు, తదితర రికార్డులను పరిశీలించి సూచనలు ఇచ్చారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడుతూ వారి సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు సహకరించాలన్నారు. డీఎస్పీ ఆర్.గణేష్, జయసూర్య, సీఐ శ్రీనివాసరావు, పాలకోడేరు ఎస్సై రవివర్మ పాల్గొన్నారు.

25న భారతీస్వామి అనుగ్రహ భాషణ

పాలకొల్లు అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక 24వ వార్డులోని శ్రీ శంభేశ్వర స్వామి ఆలయానికి ఈనెల 25వ తేదీ సాయంత్రం 4గంటలకు జగద్గురు విధుశేఖర భారతీస్వామి విచ్చేస్తున్నట్టు ఆలయ ధర్మకర్త కలగ అచ్చయ్య శాస్త్రి తెలిపారు. ఈసందర్భంగా స్వామికి పూర్ణ కుంభ స్వాగతం, శ్రీ రత్నమాంబ సమేత శంభేశ్వర స్వామి, శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివార్ల దర్శనం అనంతరం అనుగ్రహ భాషణం ఉంటుంది. భక్తులు అందరూ విచ్చేయవలసిందిగా అచ్చయ్య శాస్త్రి ఒకప్రకటనలో తెలిపారు.

ఇన్‌చార్జి హెచ్‌ఎంకు నోటీసు జారీ

దెందులూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జోగన్నపాలెం పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎంకు ప్రభుత్వం షోకాజ్ నోటీసు జారీ చేసింది. జోగన్నపాలెం మండల ప్రజా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనం సక్రమంగా పర్యవేక్షణ చేయలేకపోవడం వలన 9 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం సుజాతకు జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట లక్ష్మమ్మ నోటీసులు ఇచ్చారు. పాఠశాలలో పిల్లలు తినే ఆహారం సరిగా ఉడకపోవడంతో పాటు శుభ్రంగా లేకపోవడం, మధ్యాహ్న భోజన నిర్వాహకులు చేసే వంటలను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయక పోవడంతో నోటీసులు అందించమన్నారు.

ఇద్దరు దారి దోపిడీ దొంగల అరెస్టు

31.5 గ్రాముల బంగారపు వస్తువులు.. ఐదు వేల నగదు స్వాధీనం



నిందితులను అరెస్టు చేసి వివరాలు చెబుతున్న డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్

ఏలూరు క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై రాత్రి వేళ దారిదోపిడీకి పాల్పడుతున్న ఇద్దరు దొంగలను అరెస్టు చేశామని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ చెప్పారు. డీఎస్పీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ నేరస్తుల వివరాలను ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో డీఎస్పీతో పాటు భీమడోలు సీఐ యుజే విల్సన్, ద్వారకాతిరుమల ఎస్‌ఐ పి.సుధీర్‌లు పాల్గొన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ దేవరపల్లి మండలం చిన్నాయిగూడెం గ్రామానికి చెందిన అలూరి శాంతకుమార్ ఈ ఏడాది ఏప్రిల్ 25వ తేదీ రాత్రి భీమడోలులో ఉన్న తన భార్య వద్దకు మోటారు సైకిల్‌పై వస్తున్నాడు. మార్గమధ్యలో ద్వారకాతిరుమల మండలం కప్పలగుంట గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై గల ఒక కల్వర్టు వద్ద ఆగాడు. అక్కడ పొలాల్లో దాగి ఉన్న ఇద్దరు యువకులు అకస్మాత్తుగా దాడి చేసి 10 వేల రూపాయల నగదు, సెల్‌ఫోన్, బంగారపు ఉంగరాలను లాక్కొని అతని కాళ్ళు చేతులు కట్టి చెట్ల పొదల్లో పడవేసి పారిపోయారు. ఈసంఘటనపై ద్వారకాతిరుమల పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించారు. ఈ దోపిడీకి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి నుంచి ఐదు వేల రూపాయల నగదు ఒక బంగారపు ఉంగరం, టార్చిలైట్, ఈ నేరానికి ఉపయోగించిన ఆటోను సీజ్ చేశారు. అరెస్టు అయిన నిందితులు రాజమహేంద్రవరం కొంతమూరులోని జంగాలకాలనీకి చెందిన మానిపాటి విజయ్‌కుమార్ (24) రాజమహేంద్రవరంలోని చింతలనామవరానికి చెందిన రామిరెడ్డి త్రిమూర్తులను అరెస్టు చేశామన్నారు. మానిపాటి విజయ్ కుమార్ అనేక దోపిడీలు, దొంగతనాలకు పాల్పడ్డాడని తెలిపారు. పోలీసులు అరెస్టు చేసిన ఇద్దరు నిందితుల నుంచి 31.500 గ్రాముల బంగారం (ఏడు ఉంగరాలు, రెండు గొలుసులు) ఒక టార్చిలైటు, ఐదు వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అరెస్టు చేసిన పోలీసుల్ని ఎస్పీ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు



బోల్తా కొట్టిన ఆటో



చికిత్సపొందుతున్న క్షతగాత్రులు

కైకలూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కైకలూరు-కోరుకొల్లు ఆర్‌అండ్‌బీ రహదారిలో బోలెరా వ్యాను ట్రక్కు ఆటోను ఢీకొట్టిన ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గురువారం ఉదయం 4గంటల సమయంలో మండలంలోని శ్యామలాంబపురానికి చెందిన మత్స్యకారులు కైకలూరులో చేపల పట్టుబడికి ట్రక్కు ఆటోలో బయల్దేరారు. మార్గమధ్యలో ఆచవరం చల్లాలమ్మ అమ్మవారి ఆలయం సమీపంలో కాకినాడ నుంచి రొయ్యపిల్ల సీడ్‌తో మండవల్లి మండలం అయ్యవారి రుద్రవరం వెళ్తున్న బోలెరా వ్యాను ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టింది. ఆటో రహదారిపై పల్టీలు కొట్టగా బోలెరా వ్యాను పక్కనే ఉన్న డ్రెయిన్‌లో తిరగబడింది. ఆటోలో ప్రయాణిస్తున్న టి.నాగలక్ష్మీ, ఎం.శ్రీరాములు, నరసింహస్వామి, బి.అప్పయ్య తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు కైకలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. కైకలూరు టౌన్ సీఐ పి.కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక కిడ్నాప్‌పై పోక్సో కేసు



విలేకరులకు వివరాలు చెబుతున్న డీఎస్పీ శ్రీవేద

నరసాపురం రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో బాలికను మోసగించి కిడ్నాప్ చేసిన నిందితుడు చింతా నర్సింహస్వామిపై పోక్సో కేసు నమోదు చేశారు. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ శ్రీవేద విలేకర్లకు వివరాలు వెల్లడించారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికకు ప్రేమ పేరుతో మయమాటలు చెప్పి పట్టణానికి చెందిన నర్సింహస్వామి ఇతర ప్రాంతానికి తీసు కెళ్లాడు. ఆమె దగ్గర ఉన్న బంగారాన్ని కూడా జల్సాలకు వాడుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా బాలిక అచూకి దొరికిందన్నారు. వివరాలు సేకరించి బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. అప్పటి నుంచి నిందితుడు నర్సింహస్వామి కోసం గాలిస్తుండుగా గురువారం పాలకొల్లు రోడ్‌లో ఉన్నట్లు సమాచారం అందిందన్నారు. ఎస్సై వెంకట సురేష్ సిబ్బందితో వెళ్లి అరెస్టు చేశారన్నారు. సీఐ దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసుల్లో జైలు శిక్ష, జరిమానా

నూజివీడు టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్కు కేసులో నూజివీడుకు చెందిన గరికముక్కు ఆనందరావు శ్యామ్యూల్‌కు ఆరు నెలల జైలు శిక్ష, రూ.3 లక్షలు జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి గురువారం తీర్పు వెలువరించారు. నూజివీడుకు చెందిన పుట్టింపాడు రంగారావు 2019 ఆగస్టులో రూ.4 లక్షలు నగదు శ్యామ్యూల్‌కు అప్పుగా ఇచ్చాడు. బాకీ చెల్లించమని రంగారావు అడుగగా శ్యామ్యూల్ రూ.2 లక్షలకు చెక్కు ఇచ్చాడు. ఆ చెక్ బౌన్స్ కావడంతో రంగారావు కోర్టును ఆశ్రయించాడు. న్యాయ మూర్తి ముద్దాయికి జరిమానా, జైలు శిక్ష విధించారు.

• గంపలగూడెంకు చెందిన మేడంకి మేరి కుమారికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.9 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. విజయవాడకు చెందిన దరిశి నాగదుర్గ 2019 ఆగస్టులో మేరి కుమారికి రూ.8 లక్షల నగదు అప్పుగా ఇచ్చారు. బకాయి కింది నాగదుర్గకు మేరి కుమారి రూ.8.5 లక్షలు చెక్కు ఇచ్చింది. చెక్కు బౌన్స్ కావడంతో మేరి కుమారికి జరిమానా, జైలు శిక్ష పడింది.

బలవంతపు విడాకులు


రెండు గ్రామాల పెద్దలపై కేసు

కైకలూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కొల్లేరు గ్రామాల కట్టుబాట్లు మధ్య భార్యాభర్తలను విడదీసిన ఇరుగ్రామాల పెద్దలపై కైకలూరు రూరల్ ఎస్‌ఐ వి.రాంబాబు గురు వారం కేసు నమోదు చేసినట్టు తెలిపారు. 2012లో మండలంలోని చటకాయ గ్రామానికి చెందిన ముంగర సుభాష్ చంద్రరాజుకు ఏలూరు రూరల్ మండలం శ్రీపర్రుకు చెందిన రిషితతో వివాహమైంది. వీరి మధ్య విబేధాలు రావడంతో నాలుగేళ్లుగా శ్రీపర్రులో విడివిడిగా ఉంటున్నారు. ఇటీవల ఇరు గ్రామాల పెద్దలు వారు విడాకులు తీసుకునేలా ఒప్పంద పత్రాలు రాయించారు. అయితే విడాకులు తీసుకో వాలని తనపై ఒత్తిడి చేశారని బాధితురాలు కైకలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. గత సోమవారం ఏలూరులో జరిగిన గ్రీవెన్స్‌లోను ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. నెల రోజుల్లో చటాకాయ పెద్దలపై ఇది రెండో కేసు.

లారీ ఢీకొని వృద్ధురాలి మృతి

చింతలపూడి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): యర్రగుంటపల్లి గ్రామంలో చర్చి సమీపంలో గురువారం లారీ ఢీకొని గ్రామానికి చెందిన మానికల నాగమ్మ (65) తీవ్రంగా గాయపడింది. ఆమెను ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్‌ఐ కుటుంబరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి



దెందులూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వరి ఊడ్పులకు వచ్చిన కూలీ ట్రాక్టర్ కింద పడి మృతి చెందాడు. దెందులూరు గ్రామంలోని ఇంద్రవనం చెరువు వద్ద కాపలాగా ఉంటున్న మహరాష్ట్రకు చెంది పువత్తి బ్రహ్మానందం (29) ట్రాక్టర్ నడుపుతుండగా తిరగబడటంతో దాని కింద పడి మృతి చెందాడు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

దెందులూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): శింగవరం పరిధిలోని ఫ్యాక్టరీ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని పోలవరం మండలం గుటాలకు చెందిన కోరాడ సూర్యారావు(62) మృతి చెందాడు, దెందులూరు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు.



కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సంస్థ ప్రతినిధి శ్రీనివాసరెడ్డి

3ఎఫ్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

పెంటపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బాంక్‌కు 3ఎఫ్ ఫౌండేషన్ సహకారం అభినందనీయమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఇటీవల భీమవరంలో జరిగిన రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బాంక్‌కు ప్రత్తిపాడు 3ఎఫ్ స్వాభిమాన్ ఫౌండేషన్ నుంచి రూ.6 లక్షల విలువైన జనరేటర్‌ను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 3ఎఫ్ ఫౌండేషన్ సేవలను కొనియాడారు. అనంతరం ఫౌండేషన్ సేవలకు గాను ఆమె చేతుల మీదుగా సంస్థ అసిస్టెంట్ మేనేజర్ గోరంట్ల శ్రీనివాసరెడ్డికి అవార్డు అందించారు.

నేటి నుంచి హౌసింగ్‌పై సర్వే

నరసాపురం రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గృహనిర్మాణాలకు అర్హులైన లబ్ధిదారుల ఎంపిక కోసం శుక్రవారం నుంచి గ్రామాల్లో క్షేత్రస్థాయి సర్వే చేపడుతున్నట్టు హౌసింగ్ ఇన్‌చార్జి ఈఈ పి.వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం హౌసింగ్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు ఇళ్లు లేని వారిని గుర్తించి వారి వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. లబ్ధిదారుల సర్వే పారదర్శకంగా ఉండాలన్నారు. ఎటువంటి తప్పులు దొర్లకుండా పక్కాగా సర్వే చేపట్టాలని ఆదేశించారు. ఏఈ రవీంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

పీఎఫ్ సొమ్ము పై విచారణ చేపట్టాలి

తణుకు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల పీఎఫ్ సొమ్ము అవకతవకలపై విచారణ జరిపించి కార్మికులకు న్యాయం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు అన్నారు. గురువారం ఆసుపత్రి వద్ద కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల పీఎఫ్ సొమ్ము ఏడాదికి పైగా వారి ఖాతాల్లో జమ కావడం లేదన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో యూనియన్ నాయకులు పుష్పలత, వెంకటలక్ష్మి, రత్నం, విజయలక్ష్మి, లక్ష్మి, చింతాలు, ప్రసన్నకుమారి, హైమావతి పాల్గొన్నారు.

నాస్కం ఫౌండేషన్‌తో 'ఎస్ఆర్‌కేఆర్' ఎంవోయూ

భీమవరం రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల వినూత్న ఆలోచనలను స్టార్టప్‌లుగా మార్చేందుకు సాంకేతిక సాయం పొందేందుకు నాస్కం ఫౌండేషన్‌తో ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఎంవోయూ కుదుర్చుకుందని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ బీహెచ్‌వీఎస్ రామకృష్ణంరాజు తెలిపారు. గురువారం సంబంధిత పత్రాలను నాస్కం ఫౌండేషన్ ఇన్నోవేషన్ మేనేజర్ అల్బర్ట్ డైలాన్ కొరియా, ఎస్ఆర్‌కెఆర్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ బీహెచ్‌వీఎస్ రామకృష్ణంరాజు మార్చుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడారు. డీన్ అకాడమిక్స్ డాక్టర్ వి. చంద్రశేఖర్, కళాశాల కార్పొరేట్ రిలేషన్స్ మేనేజర్ అశోక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం కన్వీనర్‌గా 'పరుగు'

ఆచంట, నవంబరు21 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం మండల కన్వీనర్‌గా పరుగు మోహనరావును మండల 8వ మహా సభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కేతా గోపాలన్ తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పలు సమస్యలపై తీర్మానం చేశారు. అనంతరం మండల కన్వీనర్‌గా పి.మోహనరావు, ఎస్‌వీఎస్ శర్మ, గుత్తుల రంగారావు, కుసుమే జయరాజు, మచ్చా సుబ్బారావు, సిర్రా నరసింహమూర్తి, తలుపూరి బుల్లిబ్బాయి, చంటిబాబు, చిలుకూరి శ్రీనివాస్,ఆంజనేయులను మండల కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు.

సహారా బాధితులకు సొమ్ములు చెల్లించాలి

ఆకివీడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సహారా బాధితులకు డిపాజిట్ల సొమ్ము వెంటనే చెల్లించాలని తహసీల్దార్ నందూరి వెంకటేశ్వరరావు అన్నారు. బాధితుల ఫిర్యాదుల మేరకు గురువారం బ్రాంచి కార్యాలయాన్ని సందర్శించి మేనేజర్ పూర్ణచంద్రరావుతో మాట్లాడారు. సహారాకు డిపాజిట్లు చేసి గడువు పూర్తియి ఏళ్ల గడుస్తున్నా నగదు చెల్లించడం లేదని, ప్రతిరోజూ అనేక మంది బాధితులు తమ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారన్నారు. పూర్ణచంద్రరావు మాట్లాడుతూ బాధితులు దరఖాస్తులు చేసుకున్న తరువాత ముందుగా రూ.50 వేలు పడతాయని, అనంతరం దఫదఫాలుగా పడతాయన్నారు. అధికారులు వచ్చినట్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఆర్ఐ వీరాంజనేయులు ఉన్నారు.

బెల్టు షాపులపై దాడి.. ఇద్దరి అరెస్టు

పెనుగొండ/తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పెనుగొండ మండలం మిద్దేవారిపాలెంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న చిన్నమిల్లి వెంకటేశులును అరెస్ట్ చేశామని ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.మధుబాబు తెలిపారు. అతడి వద్ద నుంచి ఆరు మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. తాడేపల్లిగూడెం మండలం కొమ్ముగూడెంలో బెల్టుషాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి అతడి వద్ద నుంచి పది మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ కేఏస్‌వీ కళ్యాణ చక్రవర్తి తెలిపారు.

చిరంజీవి గ్రంథాలయాన్ని పట్టించుకోండి

» శాశ్వత గ్రంథాలయ అధికారి లేక ఇబ్బందులు » చిరు, పవన్ పుట్టిన రోజుల వేడుకలకే పరిమితం

మొగల్తూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మొగల్తూరులో మెగాస్టార్ చిరంజీవి పేరిట అభిమానుల సహకారంతో నిర్మించిన శాఖ గ్రంథాలయానికి అధికారి లేకపోవడంతో చదువరులు, విద్యార్థులు, నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. మొగల్తూరు పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో గల శాఖ గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో 1997లో జన్మభూమి స్ఫూర్తితో చిరంజీవి అభిమానులు విరాళాలు సేకరించి సుమారు రూ.75 వేలు ప్రభుత్వానికి చెల్లించడంతో మిగిలిన నిధులు నాటి టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ నిధులతో చిరంజీవి పేరిట మొగల్తూరులో శాశ్వత గ్రంథాలయ భవనం నిర్మించారు. ఈ భవనాన్ని చిరంజీవి సోదరుడు నాగేంద్ర బాబు ప్రారంభించారు. గత కొన్నేళ్లుగా ఈ గ్రంథాలయానికి అధికారి లేదరు. స్థానికంగా ఒకరి సహకారంతో కేవలం దిన పత్రికలు చూసే విధంగా గ్రంథాలయ తాళాలు తీసే విధంగా ఏర్పాటు చేశారు. ప్రతీ గురువారం ఒక అధికారి వచ్చి ఒక పూట ఇక్కడ విధులు నిర్వహిస్తూ గ్రంథాలయ సభ్యులకు అవసరమయ్యే పుస్తకాలు ఇస్తున్నారు. చిరంజీవి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టిన రోజు వేడుకలు మాత్రమే అభిమానులు ఇక్కడ నిర్వహిస్తున్నా గ్రంథాలయ అభివృద్ధిపై ఎవరూ దృష్టి సారించడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. మారుతున్న విద్యా పరిస్థితులకు అనుగుణంగా ఇప్పటికైనా శాశ్వత అధికారితో పాటు డిజిటల్ లైబ్రరీగా మార్చు చేసి విలువైన పుస్తకాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



మొగల్తూరులో చిరంజీవి శాఖ గ్రంథాలయం

నడిపూడి ఇసుక ర్యాంపులో ఉపాధి కల్పించాలి

పెనుగొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పనులు లేక ఇబ్బందులు పడుతున్న కార్మికులకు ఉపాధి కల్పించాలని సీఐటీయూ నాయకుడు షేక్ పాదుషా డిమాండ్ చేశారు. గురువారం పెనుగొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహసీల్దార్ బి.అనితకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజులుగా నడిపూడి ఇసుక రేవు నుంచి యంత్రాల ద్వారా 30 నుంచి 40 టన్నుల కెపాసిటీ గల లారీల ద్వారా ఇసుకను తరలించడం వల్ల స్థానిక కార్మికులకు పని లేకుండా పోయిందన్నారు. ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఏర్పాటు చేసిన సమావేశంలో ఇసుక లోడింగ్ చార్జీ అన్ని రేవుల కంటే వంద రూపా యలు తగ్గించి సరఫరా చేస్తామని తెలిపినప్పటికీ స్థానిక నాయకులు పని కల్పించే విషయంలో అడ్డుపడడంతో పని లేకుండా పోయిందన్నారు. మాదాసుర నాగేశ్వరరావు, సంఘం అధ్యక్షుడు రేలంగి సుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న తోకతిప్ప మత్స్యకారుల సొసైటీ అధ్యక్షులు తిరుమాని శ్రీనివాసరావు

'మత్స్యకారుల జీవన ప్రమాణాలు మారట్లేదు'

భీమవరం రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ మత్స్యకారుల జీవన ప్రమాణాలు మారట్లేదని తోకతిప్ప మత్స్యకారుల సొసైటీ అధ్యక్షుడు తిరుమాని శ్రీనివాసరావు అన్నారు. తోకతిప్ప గ్రామంలో గురువారం ఆంధ్రప్రదేశ్ మత్స్యకారుల, మత్స్యకార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ సందర్భంగా సంఘం జెండాను ఆయన ఎగురవేసి మాట్లాడారు. మత్స్యకారులకు వేట నిషేధ కాలంలో రూ.వేల నగదు ఇస్తామని వాగ్దానం చేసి నేటికీ ఇవ్వలేదన్నారు. మత్స్యకారులకు వలలు, బోట్లు, సంప్రదాయ భృతిని అమలు చేయాలన్నారు. చదువుకున్న మత్స్యకారుల బిడ్డలు వ్యాపారాలు చేసుకునేందుకు ఐదు లక్షలు వడ్డీ లేని రుణాలు అందించాలన్నారు. జిల్లా కార్యదర్శి జల్లి రాముమోహన్, సభ్యులు ఒడుగు శ్రీనివాసరావు, ఇంజేటి శ్రీనివాసరావు, తిరుమాని సత్యనారాయణ, తానేటి రవి, తిరుమాని సూర్యనారాయణ, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ కమిషన్ రద్దు చేయాలి

నరసాపురం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నియమించిన ఎస్సీ వర్గీకరణ కమిషన్‌ను రద్దు చేయాలని మాలల న్యాయ పోరాట సమితి డిమాండ్ చేసింది. గురువారం పోరాట సమితి ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఆర్డీవో దాసిరాజుకు వినతిపత్రం అందించారు. అనంతరం సమితి నాయకులు మాట్లాడుతూ సోడదాసి శ్రీధర్, ఏఎంసీ మాజీ చైర్మన్ దొండపాటి స్వామి మాట్లాడుతూ వర్గీకరణ ముసుగులో ఎస్సీల వివరాలు సేకరించడం సరికాదన్నారు. జిల్లాను కాకుండా రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుని ఎస్సీ జనాభా లెక్కలు చేపట్టాలన్నారు. ఎంపీపీ సోని, మనోహర్, విజయభాస్కర్, రాహుల్, అజయ్, అడిదెల శరత్, దిలీప్, ఏసురత్నం, వసంత్, జోసఫ్ పాల్గొన్నారు.



మాలల పోరాట సమితి నాయకుల ఆందోళన

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకున్నాం : ఎస్ఐ

ఆకివీడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : హైవేపై ట్రాఫిక్ నియంత్రించేందుకు చర్యలు చేపట్టామని ఎస్ఐ హనుమంతు నాగరాజు అన్నారు. ట్రాఫిక్, ప్రమాదాలు నియంత్రించేందుకు భారీ వాహనాలు మినీ బైపాస్ రోడ్ మీదుగా దారి మళ్లించి గురువారం ఆయన మాట్లాడారు. ఉండి రోడ్ నుంచి ఆకివీడు వస్తున్న భారీ వాహనాలు, లారీలు, స్థానిక మినీ బైపాస్ రోడ్డు మీదుగా అయి-భీమవరం రోడ్ నుంచి హైవేపైకి వచ్చి కైకలూరు, గుడివాడ, ఏలూరు, విజయవాడ వెళుతున్నాయన్నారు. అయితే మినీ బైపాస్ రోడ్‌లో కొన్నిచోట్ల గోతులు పూర్తిగా పూడ్చలేదని, వాహనాలకు కరెంట్ వైర్లు తగులుతున్నాయని వాహనాల డ్రైవర్లు వాపోతున్నారు. కరెంట్ వైర్లు తెగి కింద పడుతున్న సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



లారీలను బైపాస్‌కు మళ్లిస్తున్న పోలీసులు

తాడేపల్లిగూడెంలో గర్భిణులకు సీమంతాలు

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : భగవాన్ శ్రీసత్యసాయి జయంతి వేడుకలు గురువారం తాడేపల్లిగూడెంలోని సత్యసాయి మందిరంలో పూజలు చేశారు. తొలుత మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం 15 మంది గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కన్వీనర్ ఎంఎన్ఎస్‌కే జనార్దనరావు, నవీన్‌బాబా, ప్రవా శ్రీనివాస్, విష్ణుమూర్తి, గాదే శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.



సత్యసాయి మందిరంలో గర్భిణులకు సీమంతాలు

రైతు సేవా కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించండి

అత్తిలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అత్తిలి మండలంలోని రైతులు పండించిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల్లోనే విక్రయించాలని అత్తిలి తహసిల్దార్ దశిక వంశీ కోరారు. ఎట్టి పరిస్థితుల్లో కమీషన్‌దారులకు కాని, దళారులకు కాని అమ్మి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం నిర్ధేశించిన ధరకు రైతులు విక్రయిం చుకోవాలన్నారు. ఎవరైనా దీనికి భిన్నంగా వ్యవహరిస్తే వారిపై ప్రభుత్వ పరంగా చర్యలుంటాయని తహసిల్దార్ తెలిపారు.

క్షీరారామంలో స్వామి వారి ఆభరణాలు స్వాధీనం

పాలకొల్లు అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు చెందిన బంగారు, వెండి వస్తువులను దేవదాయ శాఖ శాఖ జేఈవో వి.పల్లంరాజు తనిఖీ చేసి బదిలీ అయిన ఈవో యాళ్ళ సూర్యనారాయణ నుంచి ప్రస్తుత ఈవో శ్రీనివాసరావుకు స్వాధీన పరిచారు. ప్రతీ వస్తువును నిశితంగా పరిశీలించారు. దేవదాయ శాఖ అధికారులు, అర్చకులు, సూపరింటెండెంట్ వాసు సిబ్బంది పాల్గొన్నారు

'కారెంకి' ఆర్థిక సాయం

అత్తిలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మంచిలి గ్రామానికి చెందిన ఉడతల చిట్టి శ్రీనుకు కారెంకి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.61,602 సాయంగా అందజేశారు. చిట్టి శ్రీను కుమార్తె జమునా శ్రీలక్ష్మి ప్రమాదానికి గురైనట్టు తెలపడంతో కారెంకి ఫౌండేషన్ ప్రతినిధి వీరమల్లు ఫణీంద్రకుమార్ 60 వేల 602 రూపాయలను, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం వెయ్యి రూపాయలు కలిపి నాగేశ్వరరావు, జై గౌడ సేవా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సంగెడ్డ రంగారావు, తణుకు సంఘ సభ్యుడు కట్టా రాజేష్ ద్వారా సంఘ పెద్దల సమక్షంలో అందజేశారు.



బధిరులకు స్వీట్లు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఆలయ అధికారులు

అంధులకు సేవా కార్యక్రమాలు అభినందనీయం

భీమవరంటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అన్నిదానాల్లో కెల్లా అన్నదానం, సేవా దానం గొప్పవని, అంధులు, వికలాంగులకు కార్తీక వన సమారాధన ఏర్పాటు చేసి వారికి పండ్లు దుప్పట్లు పంపిణీ చేయడం అభినందనీయమని ఆలయ ఈవో డి.రామకృష్ణంరాజు అన్నారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పంచారామ క్షేత్రమైన గునుపూడిలోని ఉమా సోమేశ్వర జనార్దన స్వామి దేవస్థానంలో పురోహితులు ఘంటసాల సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో స్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, లక్ష బిల్వార్చన నిర్వహించారు. సోమేశ్వర శర్మ మాట్లాడుతూ ప్రతి ఏడాది కార్తీక మాసంలో వేంకటేశ్వర బధిర పాఠశాల, రమణరాజు అంధ పాఠశాలల విద్యార్థులకు స్వామి దర్శనం కల్పించి ఉచితంగా దుప్పట్లు, పండ్లు, స్వీట్స్, బిస్కెట్స్ అన్నదానం చేయిస్తున్నామన్నారు. 300 మంది విద్యార్థులకు పండ్లు, దుప్పట్లు, స్వీట్స్ పంపిణీ చేశారు. ప్రధానార్చకులు కందుకూరి సోంబాబు, చెరుకూరి రామకృష్ణ, అర్చకులు పాల్గొన్నారు.



సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా ఎస్‌కేఎస్‌డీ విద్యార్థిని ఎంపిక

తణుకు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలకు చెందిన విద్యార్థిని రాయుడు దానేశ్వరి ఎంఎన్‌సీ కంపెనీ అక్సెంచర్‌లో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ లక్ష్మీసుందరీబాయి తెలిపారు. ఈనెల 23 నుంచి కోల్‌కతాలో విధులు నిర్వహిస్తారని చెప్పారు. ఈసందర్భంగా విద్యార్థిని దానేశ్వరిని కళాశాల జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకటకృష్ణారావు, ప్లేస్‌మెంటు ఆఫీసర్ హరిప్రసాదు, అధ్యాపకులు అభినందించారు.

సైన్స్ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

పాలకొల్లు అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సైన్స్‌ను అభివృద్ధి పరచడంతో పాటు, సైన్స్ ప్రయోజనాలను అందరికీ అర్థమయ్యేలా చెప్పడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని చైతన్య కృత్రిమ అవయవ కేంద్రం అధినేత డాక్టర్ వేదాంతం సదాశివ మూర్తి అన్నారు. స్థానిక బ్రాడీపేటలోని ఏవీఎస్ఎన్ఎం మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలలో గురువారం యునైటెడ్ కాపు క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన సైన్స్ ప్రయోజనాలు అనే సదస్సులో డాక్టర్ సదాశివ మూర్తి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. హర్ష మెడిక్ ల్యాబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్లడ్ గ్రూప్ పరీక్షలు నిర్వహించారు. నాయకులు డాక్టర్ ముచ్చర్ల సంజయ్, జక్కంపూడి మదన్, వేరుకొండ దుర్గా ప్రసాద్, కటారి నాగు, కొండ్రెడ్డి సూరిబాబు సిరిగినీడి రాము, పి.రవి పాల్గొన్నారు.



డాక్టర్ సదాశివమూర్తిని సత్కరిస్తున్న కాపు క్లబ్ నాయకులు

కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్‌గా
కుమార్ ప్రమాణ స్వీకారం



గణపవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కొప్పులవెలమ సంఘం రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌గా పీవీజీ.కుమార్ గురువారం ప్రమా ణస్వీకారం చేశారు. కుమార్‌ను పలువురు నాయకులు అభినందించారు. కొప్పులవెలమ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి యాళ్ళ సుబ్బారావు, సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ చింతలవాను, నాయకులు దాసరి అప్పన్న, ఆదిరెడ్డి రామచంద్రరావు, వంగపండు సత్యనారాయణ, తదితరులు ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్నారు.

ఎంఈవో ఆఫీసులో తనిఖీలు

పెనుమంట్ర, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పెనుమంట్ర మండల విద్యాశాఖ కార్యా లయాన్ని సమగ్ర శిక్షా అభియాన్ పీడీ శ్యాంసుందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం ఉదయం పెనుమంట్ర విద్యాశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ సీఆర్‌పీలు, పీఈటీలు, సిబ్బంది వివరాలను ఎంఈవో ఉంగరాల నాగేశ్వరరా వును అడిగి తెలుసుకున్నారు. సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా నిర్మాణం చేసిన పాఠశాల వివరాలు, రికార్డులను పరిశీలించారు. సీఆర్పీలు సత్యనారాయణ మంగతాయారు నరేష్, డేటా ఎంట్రీ ఆపరేటర్ చంటి తదితరులు పాల్గొన్నారు

చాంబర్స్ కాలేజీలో వైద్య పరీక్షలు

పాలకొల్లు అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక చాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో గురువారం 26 మందికి విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 22 మంది రక్తదానం చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కేవీఆర్ నరసింహారావు పాల్గొని విద్యార్థులను అభినందించారు. కళాశాల కరస్పాండెంట్ సెక్రటరీ కలిదిండి రామరాజు పుట్టిన రోజు సందర్భంగా పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

ఆధ్యాత్మికం

ఆచంటేశ్వరునికి లక్షపత్రి పూజ

ఆచంట, నవంబరు21(ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం పురస్కరించుకుని ఆచంటేశ్వరునికి గురువారం శెట్టిబలిజ వర్తక సంఘం ఆధ్వర్యంలో సామూహికంగా లక్షపత్రి పూజ, పార్వతిదేవికి లక్ష కుంకుమార్చన నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన శెట్టిబలిజ కులస్థులు, వర్తక సంఘం నాయకులు పాల్గొన్నారు.

చెన్నమల్లేశ్వరి స్వామికి లక్ష పత్రిపూజ

ఉండి : ఉండి చెన్నమల్లేశ్వర స్వామి ఆలయంలో లక్ష పత్రి పూజ వైభవంగా నిర్వహిం చారు. గురువారం రాజులపేటలో వున్న స్వామి వారి ఆలయానికి భక్తులు విచ్చేసి పూజలు చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వర ఆలయ పునఃప్రతిష్ఠ

తాడేపల్లిగూడెం రూరల్ నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కడియద్దలోని గణపతి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమం గురువారం వేడుకగా నిర్వహించారు. మూడు రోజుల నుంచి వేద మంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహించారు. బుధవారం రాత్రి గుంటూరు శివస్వామి ప్రత్యేక బాషణ చేశారు. సుమారు పది వేల మంది భక్తులు అన్నసమారాధనలో పాల్గొన్నారు.



కడియద్దలో గణపతి సుబ్రహ్మణ్యస్వామి వారు.. అన్నసమారాధనలో భక్తులు

వన, అన్న సమారాధనలు

కాళ్ల/అత్తిలి/ఉండి : కాళ్ళకూరు వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం నిర్వహించిన వనసమారాధనకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు విచ్చేసి స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈవో ఎం.అరుణ్‌కుమార్, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. అత్తిలి మండలం అత్తిలి బస్టాండ్ సెంటర్‌లోని నాగమ్మ తల్లి అమ్మవారి ఆలయం వద్ద నాగులచవితి ఉత్సవాల సందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు. నాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తోపుడు బండ్ల వర్తక సంఘం, ఆలయ కమిటీ సభ్యులు, నరుకుల వీర రాఘవులు తదితరులు పాల్గొన్నారు. ఉండి కొత్తపేటలోని శ్రీదత్త ఆలయంలో అన్నసమారాధన నిర్వహించారు.

ఘనంగా పడిపూజ

భీమవరంటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ప్రభుత్వ రజక కార్పొరేషన్ డైరెక్టర్ టీడీపీ నేత ఉప్పులూరి చంద్రశేఖర్ గురుస్వామి 18వ శబరిమలై యాత్ర సందర్భంగా పట్టణంలో పడి పూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పూజాకార్యక్రమాల్లో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ, ఎమ్మెల్యే రామాంజనేయులు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, మెంటే పార్థసారథి పాల్గొన్నారు. గురుస్వామి పెనుమత్స రామరాజు, ప్రధాన పూజారి ఖండవల్లి కేశవాచార్యులు, అప్పారావు గురుస్వామి, పూజారి ప్రసాద్ స్వామిలను సత్కరించారు.



శరవేగంగా సీసీ రోడ్లు

తాడేపల్లిగూడెం రూరల్ నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అప్పారావుపేట గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం శరవేగంగా సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం పల్లె పండుగ గ్రామసభలో బాగంగా గ్రామంలో అవసరమైన ఏడు రోడ్లు, 543 మీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణానికి తీర్మానం చేయగా రూ.30 లక్షలు ఉపాధిహామీ నిధులు విడుదల చేశారు. ఈ నిధులతో ఇప్పటికే ఆరు రోడ్లు నిర్మించారు. కార్యక్రమాలను ఏఈ శ్రీనివాస్, సర్పంచ్ ఆరుగొలను శ్రీనివాస్, నాయకులు ఆకుల తాతారావు పర్యవేక్షించారు.

శుద్ధిచేసిన నీటిని సరఫరా చేయాలి

నరసాపురం టౌన్, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 14వ వార్డుల్లో గురువారం కమిషనర్ అంజయ్య పర్యటించారు. వార్డుల్లోని సమస్యలపై ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. తాగునీరు సక్రమంగా రావడం లేదని కౌన్సిలర్ కొప్పాడ కృష్ణవేణి కమిషనర్ విన్నవించారు. నీటిని శుద్ధిచేసిన తరువాత తాగునీటిని సరఫరా చేయాలన్నారు. డీఈ ప్రవీణ్‌కుమార్, ఏఈ కిశోర్ పాల్గొన్నారు.

ఉల్లంపర్రులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

పాలకొల్లు రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉల్లంపర్రు రైతు సేవా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏవో రాజశేఖర్ గురువారం ప్రారంభించారు. ఏవో మాట్లాడుతూ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా తమ పంటను అమ్ముకోవాలని దళారులను నమ్మవద్దని అన్నారు. గ్రామస్థులు పాశర్ల సింహాచలం, పాశర్ల వెంకటరమణ, మద్దు సత్యనారాయణ, బొడ్డు శ్రీను, అడపా నాగేశ్వరరావు, అడపా శ్రీను, పాశర్ల సత్యనారాయణ, సూర్యం రైతుల, సిబ్బంది పాల్గొన్నారు.

62 వేల టీడీపీ సభ్యత్వాలు

పాలకొల్లు అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పాలకొల్లు నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బాగంగా ఇప్పటికే 62 వేలు దాటిందని పట్టణ అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు తెలిపారు. గతంలో పాలకొల్లు నియోజకవర్గం రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలిచిందని, ఈసారి కూడా అదే ఉత్సాహంతో నాయకులు, కార్యకర్తలు పనిచేస్తున్నారన్నారు. మంత్రి డాక్టర్ నిమ్మల, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ ప్రోత్సాహంతో నియోజకవర్గంలో పార్టీ మరింత పటిష్ఠం కానుందని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల ప్రాంతాలు

తణుకు/కాళ్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : తణుకు, అత్తిలి, ఇరగవరం, పైడిపర్రు సబ్ స్టేషన్ల లైన్ల మరమ్మతుల నిర్వహణ నిమిత్తం శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు డివిజన్ ఇంజనీర్ నరసింహామూర్తి తెలిపారు. తణుకు పట్టణ పరిధిలోని బ్యాంకు కాలనీ, రైల్వే స్టేషన్ రోడ్డు, యాపిల్ ఆసుపత్రి, ఎన్ఎస్‌సీ బోసు రోడ్డు, నరేంద్ర సెంటర్, వేల్పూరు. ఉండ్రాజవరం రోడ్డు, టి.వేమవరం, మున్సిపల్ ఆఫీసు ఏరియా, కొండాలమ్మ పుంతరోడ్డు, ఎన్టీఆర్ పార్కు ఏరియా, తణుకు మండలంలోని మండపాక, పైడిపర్రు, ఇరగవరం మండలంలో గోటేరు, యర్రాయి చెర్వు, కేతావారిపాలెం, కాకుల ఇల్లిండ్రపర్రు, గోపాలపురం, అత్తిలి మండలంలో అత్తిలి, మంచిలి, పాలూరు, ఉరదాళ్ళపాలెం గ్రామాలు వినియోగదారులు సహకరించాలని కోరారు. కాళ్ళ మండల పరిధిలో శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు బొండాడ, బొండాడపేట, కోపల్లె, గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు.

క్రీడా సామగ్రి అందజేత

పాలకొల్లు అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీవర్స్ కాలనీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఫెమీనా క్లబ్ ఆధ్వర్యంలో గురువారం క్రీడా సామగ్రిని అందించారు. క్లబ్ అధ్యక్షురాలు మాచేపల్లి ఉమ మాట్లాడుతూ క్రీడలతో శారీరక దారుఢ్యం పెరగడంతో పాటు మానసిక వికాసం ఏర్పడుతుందన్నారు. హెచ్ఎం ఆర్‌భవానీప్రసాద్, ఫెమినా లయన్స్ క్లబ్ కార్యదర్శి ఇమ్మిడి లలిత, సభ్యులు నంబూరి భాగ్యలక్ష్మి, కంచర్ల సుశీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాపారవేత్త సుబ్బారావు మృతి



సుబ్బారావు (ఫైల్)

పాలకొల్లు రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యాపారవేత్త, సివిల్ ఇంజనీర్, టీడీపీ నేత ఆకుల సుబ్బారావు (60) గురువారం ఉదయం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు కొద్దికాలంగా ఆయన కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఆయన మృతికి మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ఫోన్ ద్వారా సంతాపం తెలిపారు. ఆయన భౌతికకాయానికి మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. మాజీ కౌన్సిలర్లు నార్ని ప్రతాప్, యలకల రంగా, పోలిశెట్టి రాధాకృష్ణ సంతాపం తెలిపారు.